

ఆమదాలవలస మునిసిపల్ కమిషనర్‌గా రవి

శ్రీకాకుళం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పలు మునిసిపాల్టీల కమిషనర్‌లను బదిలీచేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమదాలవలస మునిసిపాల్టీ కమిషనర్‌గా జి.రవిని నియమించింది. ఈయన తాడిపత్రి మునిసిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ అక్కడ నుంచి ఎన్నికల బదిలీల నేపథ్యంలో ఇక్కడకు వస్తున్నారు. ప్రస్తుతం ఆమదాలవలస కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.రవిసుధాకర్ సొంత డిపార్ట్‌మెంట్ సీడీఎంఏ (కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్)కు రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

పూచీకత్తు ఉంటేనే.. ఉద్యోగం



ఎచ్చెర్ల డిపో వద్ద ఆందోళన చేస్తున్న మద్యం షాపుల సిబ్బంది (ఫైల్)

- ఎన్నికల ముంగిట చిరుద్యోగులకు షాక్
- రూ.3లక్షల ష్యూరిటీ సమర్పించాలని ఆదేశం
- ఆందోళనలో ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది

(రణస్థలం)

ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లు రూ.3లక్షల ష్యూరిటీ సమర్పించాలని ఇటీవల ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఒక్కొక్కరూ ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులతో ష్యూరిటీ సమర్పించాలని, లేదంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. దీంతో మద్యం దుకాణాల్లో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల ష్యూరిటీ కోసం పడరాని పాట్లు పడుతున్నారు. మద్యం దుకాణంలో ఉద్యోగమంటే సాధారణంగా చిన్నచూపు ఉంటుంది. అయినా సరే సొంత గ్రామంలో ఉద్యోగం కదా అని ఆ యువకులు చేరారు. తక్కువ జీతమైనా నెట్టుకొస్తున్నారు. తీరా నాలుగున్నరేళ్లు పనిచేసిన తరువాత.. సరిగ్గా ఎన్నికల ముంగిట ఇప్పుడు పూచీకత్తు రాయమంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

● వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన మద్యం పాలసీని ప్రకటించింది. అప్పటివరకూ ఉన్న ప్రైవేటు మద్యం షాపులను రద్దుచేసింది. ప్రభుత్వమే నేరుగా మద్యం దుకాణాలను నడిపించాలని నిర్ణయించింది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 194 మద్యం దుకాణాలు కొనసాగుతున్నాయి. ఒక్కో షాపునకు ఇద్దరు సేల్స్‌మెన్లతోపాటు ఒక సూపర్‌వైజర్‌ను నియమించింది. పెద్ద షాపులైతే ఇద్దరు, ముగ్గురు సేల్స్‌మెన్లను భర్తీ చేసింది. ఈ లెక్కన జిల్లావ్యాప్తంగా 900మందిని నియమించింది. సేల్స్‌మెన్‌కు రూ.18,500, సూపర్‌వైజర్‌కు రూ.21,500జీతంగా నిర్ణయించింది. ఇటీవల స్వల్ప మొత్తంలో జీతాలను పెంచింది. ఉన్న ఊరిలో కాకుండా కొంతమందిని పక్క మండలాలకు బదిలీ చేసింది. అయితే తాజాగా ఒక్కొక్కరూ ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల ష్యూరిటీ పొందాలని షరతు విధించింది. లేదంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించడంతో ఏంచేయాలో తెలియక అయోమయం చెందుతున్నారు. ష్యూరిటీ ఇచ్చేందుకు ఉద్యోగులు ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం ఎచ్చెర్లలోని ఐఎంఎల్ డిపో డీఎం బి.సుబ్బారావుకు వినతిపత్రాన్ని అందజేశారు.

● రాజకీయముద్రతో ఇబ్బందులు

మద్యం దుకాణాల్లోని సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లను సిఫారసులతో నియమించడంతో వీరిపై రాజకీయ ముద్ర పడుతోంది. దాదాపు షాపులన్నీ అధికారపార్టీకి చెందిన వారివే కావడంతో సదరు నేతలు చెప్పినట్టుగా నడుచుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వ దుకాణాల సమీపంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, ఇతర దుకాణాల నిర్వహణలోనూ నేతల మాటే చెల్లుబాటు అవుతోంది. బెల్ట్ దుకాణాలకు మద్యం సీసాల సరఫరా, షాపు నిరిష్ట సమయం తరువాత మద్యం తెప్పించుకోవడం వంటివి చేస్తున్నారు. దీంతో ఆ ప్రభావం తమపై పడుతోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బేవరేజెస్ కంపెనీతో పాటు బాట్లింగ్ యూనిట్ నుంచి మద్యం తెచ్చే క్రమంలో సీసాలు పాడవుతున్నాయని.. వాటికి సైతం తమను బాధ్యులు చేస్తున్నారని వాపోతున్నారు.

● పీఎఫ్.. కష్టమే

మద్యం షాపులను ఏర్పాటు చేసిన తొలినాళ్లలో నేరుగా ఎక్సైజ్ శాఖే వీరికి జీతాలు చెల్లించేది. పీఎఫ్, ఈఎస్ఐ వంటివి జమయ్యేవి. తరువాత షాపుల నిర్వహణ, సిబ్బంది బాధ్యతను ఓ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించింది. సదరు సంస్థ పీఎఫ్, ఈఎస్ఐ కోత విధించి జీతం అందించేది. కానీ చాలా నెలలపాటు పీఎఫ్ జమ చేయలేదు. సంబంధిత నంబరు ఇవ్వలేదు. కొద్దినెలలు గడిచిన తరువాత అందరికీ పీఎఫ్ అమౌంట్ కోత విధిస్తున్నట్టు చెప్పినా అనుమానంగా ఉందని సిబ్బంది చెబుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు..

ప్రభుత్వ మద్యం షాపులో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ రూ.3లక్షలకు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల చేత పూచీకత్తు తీసుకోవాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. ఈ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు. ఇతర జిల్లాల్లో ఈ ప్రక్రియ పూర్తయింది.

- సుబ్బారావు, జిల్లా డిపో మేనేజర్, శ్రీకాకుళం

ధాన్యం అమ్మినా.. డబ్బులు పడలే!



టెక్కలి: నర్సింగపల్లి సచివాలయ పరిధిలో ధాన్యం కొనుగోలు (ఫైల్)

- నెల రోజులు గడిచినా.. జమకాని నగదు
- జిల్లా వ్యాప్తంగా బకాయి రూ.120 కోట్లు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు

● టెక్కలి మండలం నర్సింగపల్లి సచివాలయం పరిధి 547మంది రైతులు ధాన్యం విక్రయించారు. ఇప్పటివరకూ 31మంది రైతుల ఖాతాల్లో నగదు జమకాలేదు.

● పలాస మండలంలోనూ అధిక సంఖ్యలో రైతులకు ధాన్యం డబ్బులు జమకాలేదు. దీంతో వారంతా మిల్లులకు పరుగులు తీస్తున్నారు.

(టెక్కలి /పలాస రూరల్)

ధాన్యం డబ్బుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. వర్షాభావ పరిస్థితులు, సాగునీటి ఇబ్బందుల మధ్య ఆపసోపాలు పడుతూ ఖరీఫ్ సాగు చేశారు. తీరా ధాన్యం విక్రయించిన తర్వాత కూడా సకాలంలో డబ్బులు అందక తమకు ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు పౌరసరఫరాలశాఖ అధికారులు సుమారు 98వేల మంది రైతుల నుంచి 4.40 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. నాలుగు విడతలుగా రైతుల ఖాతాల్లో కొంత నగదు జమ చేశారు. ప్రస్తుతం జిల్లాలో వివిధ రైతుభరోసా కేంద్రాల ద్వారా ఎఫ్‌టీవోలు జనరేట్ చేసి మిల్లులకు ధాన్యం చేరవేసి 38 రోజులు గడుస్తున్నా సుమారు రూ.120కోట్లు రైతుల ఖాతాల్లో జమకాలేదు. జనవరి 20 తర్వాత ఎఫ్‌టీవోలు జనరేట్ చేసిన ఏ రైతు ఖాతాల్లో నగదు జమకాకపోవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఖాతాల్లో నగదు జమయిందో లేదో తెలుసుకునేందుకు బ్యాంకుల చుట్టూ తిరుగు తున్నారు. అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు అధ్యక్షులు కొందరు సంబంధిత కమిషనర్ దృష్టికి బకాయిల విషయం తీసుకెళ్లినా ఫలితం లేకపో యిందని రైతులు వాపోతున్నారు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక సతమతమవుతున్నారు. ప్రభుత్వం స్పందించి ధాన్యం బకాయిలు చెల్లించాలని కోరుతున్నారు. ఈ విషయమై పౌరసరఫరాల శాఖ డీఎం శ్రీనివాస్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా ఇప్పటికే చాలామంది రైతుల ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు. మిగిలిన రైతుల ఖాతాల్లో త్వరలో డబ్బులు జమ చేస్తామని తెలిపారు.

వాసుదేవుడి బ్రహ్మోత్సవం

- నేటి నుంచి మార్చి 6 వరకు నిర్వహణ



వాసుదేవ ఆలయ ముఖద్వారం



వాసుదేవ మూలవిరాట్

(మందస)

మందస వాసుదేవుని 15వ వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. వాసుదేవుడి ఆలయంలో బుధవారం నుంచి మార్చి 6వరకూ అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వ హించేందుకు కమిటీ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. రోజూ స్వామిజీల ప్రవచనాలతోపాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. 14వ శతాబ్దం నాటి ఈ ఆలయాన్ని మంజూష(మందస) సంస్థానాధీశులు ఎంతో అభివృద్ధి చేశారు. 1779-1823 మధ్య కాలంలో 45వ రాజు లక్ష్మణరాజ మణిదేవ్ ఈ ఆలయ వైభవాన్ని పెంచుతూ ఏటా 9 రోజుల బ్రహ్మోత్సవాల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచీ సంస్థానాధీశుల కాలం చెల్లే వరకూ ఏటా ఉత్సవాలు నిర్వహించే వారు. క్రమేపీ ఆదరణ కరువై ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. కాగా త్రిదండి చినజీయర్‌స్వామి శ్రీకూర్మం నుంచి పూరీ వరకూ పాదయాత్ర నిర్వహించిన సమయంలో ఈ ఆలయాన్ని చూసి చలించిపోయారు. ఒడిశాకు చెందిన శిల్పకళాకారులను రప్పించి ఆలయాన్ని పునర్నిర్మించారు. 2010 ఫిబ్రవరి 5న మళ్లీ బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. అప్పటి నుంచి ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తూనే ఉన్నారు. తాజాగా బుధవారం నుంచి 15వ వార్షిక బ్రహ్మోత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు వాసుదేవ పెరుమాళ్‌కు అభిషేకాలు, ఆంజనేయ స్వామి ఆలయంలో సుందరకాండ పారాయణం, ధ్వజారోహణం, హనుమద్వాహన సేవ, శేష వాహన సేవ, గరుడవాహన సేవతోపాటు అన్నమయ్య కీర్తనలు, నృత్యప్రదర్శనలు, సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా మార్చి 3న వాసుదేవుడి కల్యాణం, 4న తెప్పోత్సవం, 5న రథోత్సవం, చక్ర స్నానాలు నిర్వహిస్తారు. 6న స్నపన కార్యక్రమంతో ఉత్సవాలు ముగిస్తారు. ఉత్సవాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించాలని అర్చకులు, నిర్వాహకులు కోరారు.



సదస్సులో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

ఎన్నికల్లో సెక్టార్ అధికారుల పాత్ర కీలకం

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, ఫిబ్రవరి 27: ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసుల పాత్ర కీలకమైనదని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అన్నారు. మంగళవారం జడ్పీ సమావేశ మందిరంలో సెక్టార్ అధికారులు, పోలీసులతో ఎన్నికల ప్రక్రియపై అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'ఎన్నికల విధుల్లో చేయాల్సిన, చేయకూడని, చెక్‌లిస్టు, హ్యాండ్‌బుక్‌లను క్షుణ్ణంగా చదవాలి. రిటర్నింగ్, సెక్టార్ అధికారులు తమ పరిధిలోని ప్రతీ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించాలి. వాటిపై అవగాహన కలిగి ఉండాలి. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, సిబ్బందికి వసతుల విషయమై లోటుపాట్లు ఉంటే మా దృష్టికి తీసుకురావాలి. నిబంధనల ప్రకారం ఎన్నికలను సజావుగా నిర్వహించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం పనికి రాదు' అని స్పష్టం చేశారు. మాస్టర్ శిక్షకులు, నోడల్ అధికారులైన ఎం.కిరణ్‌కుమార్, కె.శేషగిరిరావు, ఎన్.బాలాజీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రేమ్ కాజల్, డీఆర్వో గణపతిరావు, డీఎస్పీ విజయ్‌కుమార్, 30మండలాల సెక్టార్ సిబ్బంది పాల్గొన్నారు.

15కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురు ఒడిశా వాసుల అరెస్టు

పలాస, ఫిబ్రవరి 27: ఒడిశా రాష్ట్రానికి చెందిన ముగ్గురు యువకులు రైలుమార్గంలో చెన్నైకి గంజాయి తరలిస్తూ మంగళవారం కాశీబుగ్గ పోలీసులకు పట్టుబడ్డారు. 15కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని.. వారిని అరెస్టు చేసి పలాస కోర్టులో హాజరుపరిచారు. కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడు కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా అలిగండ గ్రామానికి చెందిన రమేష్‌నాయక్, రాయఘడ జిల్లా గొయిబండా గ్రామానికి చెందిన ఇస్మాయల్‌గంటా, ఆర్.ఉదయగిరి బ్లాక్ అటిలిమ గ్రామానికి చెందిన ప్రసాద్‌కరడాలు ఆర్.ఉదయగిరి ప్రాంతంలో గిరిజనుల వద్ద 15 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. వాటిని ప్యాకెట్లుగా కట్టి లగేజీ బ్యాగుల్లో వేసుకొని చెన్నై వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు మంగళవారం ఉదయం పలాస రైలు ఎక్కేందుకు స్టేషన్‌కు వచ్చారు. వారి కదలికలు అనుమానస్పదంగా ఉండడంతో కాశీబుగ్గ పోలీసులు వారిని వెంబడించారు. వారు పరుగెత్తే క్రమంలో రైల్వేస్టేషన్ రోడ్డు రైల్వే అధికారుల అతిథిగృహం వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. వెంటనే వారిని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, రెవెన్యూ సిబ్బంది సమక్షంలో గంజాయిని తూకం వేసి నిందితులను కోర్టుకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పారినాయుడు తెలిపారు. ఇదిలా ఉండగా పలాస రైల్వే, కాశీబుగ్గ, మందస, ఇచ్ఛాపురం పోలీసుస్టేషన్ల పరిధిలో నెలరోజుల వ్యవధిలో మొత్తం 8గంజాయి ముఠాలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి భారీస్థాయిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా మూలాలన్నీ ఒడిశాలోని ఆర్.ఉదయగిరి బ్లాక్ కావడంతో అటునుంచి వచ్చే ప్రయాణికులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.



పోలీసుల అదుపులో గంజాయి రవాణాదారులు

జాతీయ లోక్ అదాలత్ 16కి వాయిదా



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా

గుజరాతీపేట, ఫిబ్రవరి 27: శివరాత్రి కారణంగా మార్చి 9న నిర్వహించాల్సిన జాతీయ లోక్‌అదాలత్‌ను 16వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. మంగళవారం కోర్టు ఆవరణలో ఆయన మాట్లాడుతూ.. 16న జిల్లాకేంద్రంతోపాటు పాటు ఆమదావలస, కోటబొమ్మాళి, పాలకొండ, పలాస, పాతపట్నం, రాజాం, సోంపేట, టెక్కలి, నరసన్నపేట, కొత్తూరు, పొందూరు, ఇచ్ఛాపురం కోర్టుల్లో లోక్‌అదాలత్ నిర్వహిస్తామన్నారు. సివిల్, క్రిమినల్, మోటార్ ఇన్సూరెన్స్, బ్యాంకుకు సంబంధించినవి, ప్రీ లిటికేషన్ స్థాయిలో ఉండే కేసుల కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు ఉచిత ప్రయాణం

అరసవల్లి, ఫిబ్రవరి 27: జిల్లాలో పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మార్చి 18 నుంచి 30వరకు ఆర్టీసీ బస్సులో ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు డీటీవో విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ హాల్‌టిక్కెట్‌ను చూపించి పరీక్షా కేంద్రాలకు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చన్నారు.

వలంటీర్లతో ఎన్నికల నిర్వహణ అప్రజాస్వామికం

- సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి లక్ష్మణరెడ్డి



మాట్లాడుతున్న లక్ష్మణరెడ్డి

శ్రీకాకుళం అర్బన్, ఫిబ్రవరి 27: వలంటీర్లతో ఎన్నికల నిర్వహణ అప్రజాస్వామికమని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో గెలిచేందుకు సీఎం జగన్ ఇదోరకం ఎత్తుగడ వేస్తున్నారని ఆరోపించారు. 'ఓటు వేద్దాం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం' అనే నినాదంతో సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఈ నెల 25నుంచి రాష్ట్రస్థాయి కళాజాత నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక బాపూజీ కళామందిర్‌లో నిర్వహించిన కళాజాత కార్యక్రమంలో లక్ష్మణరెడ్డి ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. 'వలంటీర్లకు కోడ్, సర్వీస్ నిబంధనలు వర్తించవని, వారిని పోలింగ్‌బూత్ ఏజెంట్లుగా వాడతామని, అవ్వాతాతలను వారి ద్వారా పోలింగ్ కేలింగ్ కేంద్రాలకు తరలిస్తామని సీఎం జగన్ చెప్పడం.. ఎన్నికల నిబంధన ఉల్లంఘనే. ఈ ప్రకటనలకు అనుభవజ్ఞుడైన మంత్రి ధర్మాన ప్రసాదరావు సైతం వత్తాసు పలకడం శోచనీయం. అధికారపార్టీ నేతలు ఎన్నికల్లో ప్రలోభాలకు పాల్పడి విజయం సాధించాలని చూస్తున్నారు' అని లక్ష్మణరెడ్డి ఆరోపించారు. ఎన్నికల ప్రచారానికి ఉద్యోగులు, వలంటీర్లు దూరంగా ఉండాలని కోరారు. ఓటరు జాబితాలో లోపాలు లేకుండా, ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు తాము కృషి చేస్తున్నామని తెలిపారు. తమ సంస్థ పనితీరుతో.. తిరుపతిలో ఓట్ల జాబితాలో అవకతవకలకు పాల్పడిన ఓ ఐఏఎస్ అధికారిని సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. ఎన్నికల్లో సచివాలయ ఉద్యోగులను కేవలం సిరా రాసేందుకు మాత్రమే వినియోగించాలని సూచించారు. యువత ఓటుహక్కుతో మెరుగైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కవి అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు యువత ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. ముందుగా కళాకారులు రాజేష్.. ఓటుహక్కుతోపాటు దాని విలువను జానపద గేయరూపంలో వినిపించి యువతకు చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పి.హరిప్రకాష్, లైన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ పి.రవికుమార్, లైన్స్ చైర్‌పర్సన్ నటుకుల మోహన్, జోనల్ చైర్‌పర్సన్ బి.దేవభూషణరావు, కొంక్యాన వేణుగోపాల్, దుప్పల వెంకటరావు పాల్గొన్నారు.

సరుబుజ్జిలిలో నరసన్నపేట ఓటర్లు

- ఆమదాలవలసలో తొలగని మృతుల పేర్లు

(సరుబుజ్జిలి)

సరుబుజ్జిలి మండలంలోని అమృతలింగానం 162వ పోలింగ్ కేం ద్రంలో 367మంది ఓటర్లు ఉన్నారు. ఈ కేంద్రం పరిధిలో నరసన్నపేట నియోజకవర్గ కొల్లవానిపేటకి చెందిన కొల్ల రమేష్, కొల్ల బాంధవి 134, 135 నెంబర్లతో ఓటర్లుగా నమోదయ్యారు. సుమారు 20ఏళ్ల కిందట గ్రామం విడిచి నందిగాం మండలం పేడాడపేట వలస వెళ్లినా బెండి శ్రీనివాసరావు, సుశీల, చంద్రశేఖరరావు ఓట్లు కూడా ఇక్కడ ఉండడం గమనార్హం. వీటిని తొలగించాలని బీఎల్‌వోకు చెప్పినా.. పట్టించుకోలేదని స్థానిక నాయకులు ఆరోపిస్తున్నారు.

● సరుబుజ్జిలి మండలం మూలసవలాపురం 117వ పోలింగ్ కేంద్రం పరిధిలో మృతుల ఓట్లు కొనసాగుతున్నాయి. కొన్నేళ్ల కిందట మృతి చెందిన బబ్బోది గన్నెప్పడు, సింహాద్రి, కవి తమ్మ, మీసాల లచ్చుమ్మ, సిరిపిల్లి కాంతమ్మ పేర్లు ఓటర్ల జాబితాలోనే కొనసాగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఆమదాలవలస 52వ కేంద్రంలోని ఓటర్ల జాబితాలో మృతుల పేర్లు

● ఆమదాలవలస మునిసిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లోనూ మృతుల ఓట్లు తొలగించలేదు. ఐదో వార్డులోని 52వ పోలింగ్ కేంద్రంలో పదిమంది మృతుల ఓట్లు కొనసాగుతున్నాయని, ఫిర్యాదు చేసినా వాటిని తొలగించలేదని పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు తంగి గురయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వార్డులో 710 మంది ఓటర్లు ఉండగా జాబితాలోని 169 నెంబర్ తాలాపు గండెమ్మ, 161 పట్నాన అప్పయ్య, 136 ముద్దాడ చిన్నోడు, 148 చల్ల దుర్గారావు మరణించారు. అలాగే ఓటర్ల జాబితాలోని 76 నెంబర్ సింగపూర్ గురుమూర్తి 205, తాన్న సూరయ్య 261, లుంగీ బేరి రామారావు 139, ముద్దాడ అమ్మన్న 475, పల్లి అప్పన్న 668, లింగిబేరి అప్పన్న కొన్నాళ్ల కిందట మృతి చెందారు. వారిపేర్లు ఓటర్ల జాబితాలో కనిపిస్తున్నాయి. అలాగే 51వ పోలింగ్ కేంద్రంలో రెండు చోట్ల ఓటర్ల నమోదుతోపాటు మృతుల పేర్లు కూడా కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు స్పందించి ఓటర్ల జాబితా సరిచేయాలని పలువురు కోరుతున్నారు.

ఎక్స్‌ప్రెస్ హాల్ట్‌లేవీ?


పూండి రైల్వే స్టేషన్

ఒక్క ఎక్స్‌ప్రెస్ రైలు కూడా ఈ స్టేషన్‌లో ఆగకపోవడంతో ఇక్కడి నుంచి ప్రయాణించే సుమారు మూడు మండలాల ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

- కనీస సదుపాయాలు శూన్యం
- ఇబ్బందులు పడుతున్న మూడు మండలాల ప్రజలు
- పూడి స్టేషన్‌పై రైల్వే అధికారుల నిర్లక్ష్యం

వజ్రపుకొత్తూరు

స్వాతంత్ర సమరం నుంచి ప్రాధాన్యం పొందిన పూండి రైల్వే స్టేషన్‌పై అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఉప్పు సత్యాగ్రహ సమయంలో మహాత్మా గాంధీ ఈ స్టేషన్‌లో దిగి ఉద్యమానికి నాయకత్వం వహించి ప్రజల్లో స్ఫూర్తి కలిగించారనేందుకు చారిత్రక సాక్ష్యాలున్నాయి. ఈ ప్రాంతంలో పండే ఉప్పును తీసుకువెళ్లేందుకు, నువ్వలరేవులో ఉన్న ఓడరేవు నుంచి సరుకులు తరలించేందుకు బ్రిటీష్ వారు ఈ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఆ తరువాత పాసింజర్ రైలు నడవడంతో ఈ ప్రాంతీయులు ఇతర ప్రాంతాలకు రాకపోకలకు ఈ స్టేషన్‌ను ఉపయోగించడం ప్రారంభించారు. రోజు రోజుకూ ఈ స్టేషన్ నుంచి ప్రయాణికుల రాకపోకలు పెరుగుతూనే ఉన్నాయి. కళ్లెదురుగా వివిధ ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్‌లు ఈ స్టేషన్ గుండా వెళుతున్నా వాటిలో ఇక్కడి ప్రయాణికులు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు.

50 గ్రామాలకు అనుకూలమైనా..

ఈ స్టేషన్ వజ్రపుకొత్తూరు. నందిగాం, సంతబొమ్మాళి మండలాలకు చెందిన సుమారు 50 గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు ఈ పూండి రైల్వే స్టేషన్ ఎంతో అనుకూలంగా ఉంది. అయితే ఎక్స్‌ప్రెస్‌లు నిలుపుదల చేయకపోవడంతో పలాస, నౌపడా స్టేషన్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. దీంతో సమయంతో పాటు అద నపు భారం పడుతోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ స్టేషన్‌కు ఆదాయం బాగానే వస్తుందని, అయితే రైల్వే ఉన్నతాధికారులు చిన్నచూపు చూస్తున్నారన్న విమర్శలు విని పిస్తున్నాయి. కరోనాకు ముందు పూరి-తిరుపతి, తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్‌లు ఈ స్టేషన్‌లో నిలుపుదల చేసేవారు. అయితే ఆ సదుపాయాన్ని ఎత్తివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో బరంపురం వైపు వెళ్లాలన్నా పలాసకు వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. స్టేషన్‌లో కనీస సదుపాయాలు నామమాత్రంగా ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి ఎక్స్‌ప్రెస్‌లను నిలుపుదల చేయడంతో పాటు సదుపాయాలను కల్పించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



పూండి స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. కేవలం డీఎంయూ, ఈఎంయూ పాసింజర్లు మాత్రమే నిలుపుదల చేస్తున్నారు. హైదరాబాద్, గుజరాత్, భిలాయి తదితర ప్రాంతాలకు ఈ ప్రాంతీయులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ హాల్ట్ లేకపోవడంతో వీరంతా పలాస, నౌపడా స్టేషన్‌లపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఇటు బరంపురం వెళ్లేందుకు రైలు లేకపోవడం బాధాకరం. ఎంతో చారిత్ర కలిగిన స్టేషన్‌పై అధికారులు శీతకన్ను వేశారు.

-రంధి రమణబాబు, వజ్రపుకొత్తూరు

ఎక్స్‌ప్రెస్‌ల కోసం వినతిపత్రం ఇచ్చాం..



పూండిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేయించాలని ఎంపీ రామ్మోహన్ నాయుడుతో కలిసి ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రికి, అధికారులకు వినతిపత్రం అందించాం. సానుకూలంగా స్పందించారు. మరోసారి ఈ సమస్యను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లి ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేయించాలని కోరతాం.

-కర్ని రమణ, టీడీపీ ప్రధానకార్యదర్శి, వజ్రపుకొత్తూరు

శిరీషను కలిసిన టీడీపీ జిల్లా నాయకులు


మాజీ మంత్రి గౌతు శివాజీ, శిరీషతో టీడీపీ జిల్లా నాయకులు

పలాస: టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషను నూతన గృహంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, మాజీ ఎమ్మెల్యేలు కలమట వెంకట రమణ, బగ్గు రమణమూర్తి తదితరులు మంగళవారం కలిసి అభినందించారు. వారికి వెంకటేశ్వర స్వామి ప్రసాదాలను శిరీష అందించారు. కార్యక్రమంలోమాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ, పార్టీ రాష్ట్ర కార్య దర్శి వజ్జ బాబూరావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, జిల్లా కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనుల పరిశీలన

కాశీబుగ్గ: జిల్లాలో 2016 పాఠశాలల్లో రూ.673 కోట్లతో నాడు-నేడులో భాగంగా ఆధునికీకరణ పనులు చేపడుతున్నామని ఏపీఈడబ్ల్యూడీసీ చైర్మన్ నాగార్జున యాదవ్ తెలిపారు. మంగళవారం కాశీబుగ్గ జడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులు, మిడ్డేమీల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో నాడు-నేడు డీఈ మూర్తి, ఏఈ రాజేంద్ర, సునీల్, పాఠశాల హెచ్‌ఎం చిన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీముఖలింగేశ్వర హుండీల లెక్కింపు

జలుమూరు: శ్రీముఖలింగేశ్వరస్వామి ఆలయంలోని హుండీలను గురువారం తెరిచి లెక్కించ నున్నట్లు ఈవో పి.ప్రభాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు దేవదాయ శాఖ అధికారులు, పాలకమండలి సభ్యులు, గ్రామపెద్దల సమక్షంలో లెక్కింపు నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలి

నందిగాం: ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని టెక్కలి గృహనిర్మాణశాఖ డీఈఈ వి.నర్సింగరావు సూచించారు. మంగళవారం పెద్దతామరాపల్లిలో ఇంటి పనులను పరిశీలించారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకొని సొంతింటి కలను నెరవేర్చుకోవాలని కోరారు. బిల్లుల విషయంలో జాప్యం ఉండదని, పనులను త్వరితగతిన చేపట్టాలన్నారు. ఆయనతో పాటు ఏఈ కె.కృష్ణమూర్తి తదితరులున్నారు.

సంక్షేమ పథకాలు అమలు ఘనత మోదీదే

టెక్కలి: అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ప్రధాని మోదీదేనని బీజేపీ యువ మోర్చా నాయకులు బూరి నరేంద్ర అన్నారు. మంగళవారం విక్రంపురం, చల్లపేట, అక్కవరం, బొప్పాయిపురం, శ్యామసుందరాపురం గ్రామాల్లో ప్రజాపోరు యాత్ర నిర్వహిం చారు. కార్యక్రమంలో నేతలు దూపాన రాజకుమార్‌రెడ్డి, కామరాజు, నేతింటి రాజారావు, లింగరాజు, కామేశ్వర రెడ్డి ఉన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

కె.కొత్తూరు (టెక్కలి): విద్యార్థులు తమలో దాగి ఉన్న నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, దీనికి ఇటువంటి కార్యక్రమాలను వినియోగించుకోవాలని రాష్ట్ర ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో అనిల్ టెంటు అన్నారు. ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయి గోకార్ట్ చాంపియన్‌షిప్-2024, సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన యాక్‌తాన్- 2024 పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ- రాష్ట్ర ఇన్నోవేషన్ సొసైటీ సైతం 40 యూనివర్సిటీలతో కలిపి యాక్ తాన్ వంటి పోటీలను నిర్వహిస్తోందన్నారు. ఈ పోటీలను ఐతం కళాశాల నిర్వహించడం అభినం దనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ కె.సోమేశ్వరరావు, కార్యదర్శి ఎల్ఎల్ నాయు డు, కోశాధికారి టంకాల నాగరాజు, డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఏఎస్ శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అనిల్ టెంటు, డా.సోమేశ్వరరావు

రోడ్డు పక్కనే చెత్త కుప్పలు

ఎల్.ఎన్.పేట: మండలంలోని ప్రధాన రోడ్లకు ఇరుపక్కలా చెత్తను వేస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోవిలాం జంక్షన్‌కు కూతవేటు దూరంలో అలికాం-బత్తిలి ప్రధాన రోడ్డుకు రెండువైపులా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. వీటి నుంచి దుర్గంధం వెదజల్లుతుండడంతో సమీపంలోకి కాలనీ వాసులు ఇక్కట్లకు గురవుతున్నారు. అలాగే లక్ష్మీనర్సుపేట జంక్షన్ నుంచి గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన కూడా చెత్త కుప్పలు పేరుకుపోయాయి. దుర్వాసన వెదజల్లుతుండడంతో అటుగా వెళ్లేవారు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్త కుప్పలను తొలగించే చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


లక్ష్మీనర్సుపేటకి వెళ్లే రోడ్డు పక్కన చెత్త కుప్పలు

చెరువులో మట్టి తవ్వకుండా పర్యవేక్షించండి

రెవెన్యూ అధికారులకు గనులశాఖ ఆదేశం



ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం



పలాస: జయరామచంద్రపురం కుంకుమ సాగరంలో మట్టిని అక్రమంగా తవ్వకుండా పర్యవేక్షిం చాలని రెవెన్యూ అధికారులను గనులు భూగర్భ శాఖాధికారి డి.ఫణి భూషణ్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వాటి ప్రతులను జిల్లా సమాచారశాఖ కార్యాలయం ద్వారా 'ఆంధ్రజ్యోతి'కి మంగళవారం అందించారు. ఈనెల 17న 'అంతా మాయిష్టం' శీర్షికతో చెరువులో మట్టి తవ్వకాలపై వచ్చిన కథ నానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఇప్పటికే నీటిపారుదలశాఖ అధికారులు అక్రమ తవ్వకాలపై రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయగా భూగర్భశాఖ అధికారులు కూడా స్పందించి చర్యలకు ఆదేశించారు. సర్వే నెంబరు 251లో కుంకుమసాగరం చెరువు ఉందని, ఆయకట్టు చెరువు కావడంతో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

బాబు సూపర్ సిక్స్‌తో ప్రజా సంక్షేమం


సత్యవరంలో కరపత్రాలిచ్చి అవగాహన కలిగిస్తున్న బగ్గు రమణమూర్తి


లక్ష్మీపురంలో భవిష్యత్తు గ్యారెంటీలో పాల్గొన్న కత్తిరి వెంకటరమణ

నరసన్నపేట, ఫిబ్రవరి 27: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమం సాధ్యపడుతుందని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఎన్నికల శంఖారావంలో భాగంగా సత్యవరంలో మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రంలో చేపట్టనున్న సంక్షేమ పథకాలను వివరిం చారు. వైసీపీ వైఫల్యాలపై అవగాహన కలిగించి రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి సహకరించాలని కోరారు. కార్య క్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి గొద్దు చిట్టిబాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకుడు బెవర రాము, నాయకులు పీస కృష్ణ, ఊణ్ణ వేంకటేశ్వరరావు, కింజరాపు రామారావు, సరిపల్లి మధు, మావుడూరి జగదీష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేనతోనే రాష్ట్రాభివృద్ధి

జలుమూరు (సారవకోట): టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. బుడితి లక్ష్మీపురంలో మంగళవారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైసీపీ వైఫల్యాలను, టీడీపీ-జనసేన అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు పొదిలాపు వేణుగోపాలరావు, డి.జయరాం, తర్ర లచ్చుము, ఎం.గోవిందరావు, చల్ల జనార్దన, చంద్రయ్య, బలగ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల ద్వారా జీడి పిక్కలను కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

టెక్కలి: జీడికి మద్దతు ధరను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ప్రకటించడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యుడు కె.మోహన్ ప్రశ్నించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నేతలు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 80 కేజీల జీడి బస్తాకు రూ.16 వేలు చెల్లించాలని, ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గిట్టుబాటు ధర లేక జీడి రైతులు దళారీల బారిన పడి దోపిడీకి గురవుతున్నారన్నారు. గిట్టుబాటు ధర కల్పిస్తేనే ఉద్దానం అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. ఇదే డిమాండ్‌తో ఏడాదిగా అనేక రీతుల్లో పోరాటం చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. సీఎం జగన్ పలాస వచ్చిన సందర్భంగా లక్ష సంతకాలతో వినతిపత్రం ఇచ్చినప్పుడు జీడి రైతుల సంఘం ప్రతినిధులతో మంత్రి అప్పలరాజు చర్చించి నెలరోజులవుతున్నా చర్చల సారాంశాన్ని నేటి వరకు బహిర్గతం చేయలేదన్నారు. ఇప్పటికైనా స్పందించాలని లేకుంటే రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు హెచ్.ఈశ్వరరావు, కొల్లి ఎల్లయ్య, బి.వాసు తదితరులు ఉన్నారు.

ఓటర్ల జాబితాలో తొలగింపులపై ఆందోళన వద్దు

- రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్


రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

టెక్కలి: టెక్కలి నియోజకవర్గ ఓటర్ల జాబితాలో తొలగింపులపై రాజకీయ పార్టీలు ఆందోళన చెందవద్దని, ఆర్వో అనుమతి లేకుండా తొలగింపు ప్రక్రియ జరగదని రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ అన్నారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల పేరు తొలగించాలంటే ఒకశాతం దాటితే చీఫ్ ఎలక్షన్ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి అనుమతులుండాలని, ఈ వ్యవహారంలో ఎన్నికల కమిషన్ కఠినంగా ఉందన్నారు. నియోజకవర్గంలో ఫారం-7 ద్వారా 1,400 దరఖాస్తులు వచ్చాయన్నారు. కొందరు బీఎల్‌వోలు ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, అవి అవాస్తవమన్నారు. ఇప్పటికే 94 శాతం ఓటు హక్కు కార్డుకు ఆధార్ సీడింగ్ ప్రక్రియ పూర్తయిందన్నారు. అర్హులైన వారు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కింజరాపు హరిప్రసాద్, వెలమల కామేశ్వరరావు, పినకాన అజయ్‌కుమార్, మళ్ల బాలకృష్ణ (టీడీపీ), బోకర నారాయణరావు (బీఎస్పీ), షణ్ముఖరావు (సీపీఎం), ఎం.రాంప్రసాద్ (జనసేన) తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి


తమ్మయ్యపేట పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నరసన్నపేట: పోలింగ్ కేంద్రాల్లో పూర్తి మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని ఏఆర్వో రామ్మోహనరావు అన్నారు. మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నరసన్నపేట నియోజకవర్గంలో 21 పోలింగ్ కేంద్రాల జాబితాను పరిశీలించి సరిచేసేందుకు నిర్ణయించామన్నారు. పోలాకి మండలంలో 3 పోలింగ్ కేంద్రాలను మార్పు చేశామన్నారు. సారవకోటలో కూడా కొన్ని పోలింగ్ కేంద్రాలను సరిచేయడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు లేకపోవడంపై ఎన్నికల అధికారి జగన్మోహనరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ్మయ్యపేట కేంద్రంలో పూర్తిస్థాయి వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

టెక్కలి: గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూని యర్ కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఈ జట్టులో టెక్కలి మండలం అక్కవరం పాఠశాలకు చెందిన కె.అమృత, కె.భవానీ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారని హెచ్‌ఎం కె.పద్మ తెలిపారు. వీరిని ఎంఈవోలు తులసీరావు, చిన్నారావు, సర్పంచ్ అప్పలనాయుడు, పీఈటీ నీలయ్య అభినందించారు.

ఘనంగా ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం


కోలాటం ఆడుతున్న చిన్నారులు

జలుమూరు: అక్కివలసలో నూతనంగా నిర్మించిన కోదండరామాలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుడు అక్కాజోస్యుల రమేష్ శర్మ ఆధ్వర్యంలో రుత్వికులతో గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన, రుత్విక్ వరుణ, అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణం, అంకురార్పణ తదితర కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం చిన్నారుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం కోదండరాముని విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు.

ఎన్‌వైకే ఆధ్వర్యంలో క్రీడా పోటీలు




బ్లాక్ లెవల్ క్రీడల్లో రాణించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

టెక్కలి: నెహ్రూ యువ కేంద్రం (ఎన్‌వైకే) ఆధ్వర్యంలో చాకిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం కబడ్డీ, ఖోఖో, పరుగుపందెం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను హెచ్‌ఎం ఎం.అనూరాధ ప్రారంభించారు. విజేతలకు ఎన్‌వైకే బ్లాక్‌లెవల్ వలంటీర్ ధర్మాన రాము బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీడి పంటకు తెల్లబూజు తెగులు

- ఆందోళన చెందుతున్న రైతులు

వజ్రపుకొత్తూరు: ఉద్దానంలో జీడిపంటకు తెల్లబూజు తెగులు సోకి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కొన్ని నెలలుగా వర్షాలు లేకపోవడంతో పూతకు బూజు సోకడంతో జీడిపంటకు తీవ్రంగా నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. గత ఏడాది ఇదే సమయానికి చేతికి పంట అందిందని ఈ ఏడాది మాత్రం ఇంతవరకు పూత దశలోనే ఉందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆదాయానికి గండిపడే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటకు తెల్లబూజు సోకిన విషయం తెలిపినా సంబం ధిత అధికారులు స్పందించడం లేదని వాపోతున్నారు. ఉద్యానవన శాఖాధికారులు స్పందించి తగు సూచనలిచ్చి పంటను కాపాడు కునేలా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.



జీడి పూతకు సోకిన తెల్లబూజు

'రా..కదలిరా'తో వైసీపీలో వణుకు

● తెలుగుదేశం పార్టీ నాయకులు

శ్రీకాకుళంలో నిర్వహించిన రా కదలిరా సభ విజయవంతంకావడంతో వైసీపీ నాయకుల్లో వణుకు మొదలయ్యిందని తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు.ఈ మేరకు మంగళవారం జిల్లాలో పలువురు టీడీపీ నాయకులు విలేకరులతో మాట్లాడారు.



మాట్లాడుతున్న కూన రవికుమార్

రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు నాశనం: రవికుమార్

అరసవల్లి : రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను నాశనం చేసిన దేశంలోనే ఏకైక నాయకుడు జగన్‌రెడ్డి అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఎద్దేవాచేశారు.శ్రీకాకుళంలో జరిగిన చంద్రబాబు రా...కదలిరా సభకు హాజరైన జనసందోహాన్ని చూస్తే వైసీపీ ప్రభుత్వంపై ప్రజలకు గల వ్యతిరేకత ఏపాటిదో అర్థమవుతుందని తెలిపారు. మంగళవారం స్థానిక 80 అడుగుల రోడ్డులో గల జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాకదలిరాసభకు జిల్లా నలుమూలల నుంచి స్వచ్ఛందంగా వేలాదిగా ప్రజలు తరలివచ్చారన్నారు. వైసీపీ, జగన్‌రెడ్డి, ఇతర నాయకులపై ప్రజలు చూపించిన వ్యతిరేతకు ఈ సభ అద్దం పడుతోందని చెప్పారు. విద్య, వైద్యం, కార్మిక, ఆరోగ్యం తదితర అన్ని రంగాలను వైసీపీ ధ్వంసం చేసిందని, చివరకు క్రీడారంగాన్ని కబ్జా చేసి , పూర్తిగా కలుషితం చేస్తోందని,ఇందుకు నిదర్శనమే ఆంధ్రా రంజీటీమ్ కెప్టెన్ హనుమ విహారి ఉదంతమని తెలిపారు. జాతీయ జట్టుకు ప్రాతినిథ్యం వహించి, రాష్ట్రానికి పేరు ప్రతిష్టలు తెచ్చిన వ్యక్తి పట్ల వైసీపీ నాయకులు అలా ప్రవర్తించడం హేయమని పేర్కొన్నారు. అసలు జగన్ అరాచకానికి గురికాని రంగమే లేకుండా పోయిందని, ఆడుదాం....ఆంధ్ర పేరుతో క్రీడాకారులకు నాసిరకం క్రీడా పరికరాలను సప్లై చేసి కాసుల కక్కుర్తికి తెరలేపిన వైనం దారుణమన్నారు. చంద్రబాబు రా కదలిరా సభను విజయవంతం చేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు పీఎంజే బాబు, బొనిగి భాస్కరరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమణమాదిగ, రాష్ట్ర తెలుకుల సాధికార సమితి డైరెక్టర్ కొమ్మునాపల్లి వెంక టరామరాజు పాల్గొన్నారు.

ప్రజలు విసిగిపోయారు: గుండ లక్ష్మీదేవి

వైసీపీ విధానాల పట్ల ప్రజలు పూర్తిగా విసిగిపోయి ఉన్నారని, శ్రీకాకుళంలో జరిగిన చంద్ర బాబు రా...కదలిరా సభ నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం అరసవల్లిలో విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు రాకదలిరా సభకు హాజరైన అశేష ప్రజానీకం ఉత్సాహాన్ని చూస్తే రానున్న ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించడం తథ్యమన్నారు. చంద్రబాబు పాలనతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమన్నారు. అశేష జనవాహినిని చూసి వైసీపీ నేతలకు వెన్నులో వణుకు పుట్టిందని, సభ పూర్తి కాకుండానే విమర్శించడం వారిలోని ఓటమి భయానికి నిదర్శనమని తెలిపారు.

బాబు పర్యటనతో రెట్టింపు ఉత్సాహం

గార: శ్రీకాకుళంలో సోమవారం జరిగిన చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రా కదలిరా కార్యక్రమం నిర్వహణతో పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం రెట్టింపయ్యిందని టీడీపీ నాయకులు ఎల్.రాధాకృష్ణరెడ్డి, జల్లు రాజీవ్, పి.కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. సభ విజయ వంతం కావడంతో కార్యకర్తలు, నాయకులు మరింత ఉత్సాహంతో పనిచేస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలుతో ప్రజలు విసిగిపోయారని పేర్కొన్నారు.

మహిళ దారుణ హత్య

● ఆలస్యంగా వెలుగుచూసిన వైనం



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) ఆరుద్ర (ఫైల్)

పాత పట్నం:సారవకోట మండలం ధర్మలక్ష్మీపురం గ్రామ పరిధిలో నవతల ఘాటీకి సమీపంలో మహిళ దారుణ హత్య ఉదంతం ఆలస్యంగా మంగళవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఒడిశా రాష్ట్రం పాటికోట గ్రామానికి చెందిన శాసనం ఆరుద్ర (36)ను టెక్కలి మండలం రంగాపురానికి చెందిన ఊడు పాపారావు అనే ఆటో డ్రైవర్ రాయితో తలపై, ముఖంపై గాయపరిచి హత్యచేశాడు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలున్నారు. నిందితుడు పాపారావుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. వీరిద్దరి మధ్య కొంతకాలంగా పరిచయం ఉంది. ఈనెల 23న ఆరుద్ర తన కన్నవారి గ్రామం రంగాపురంలో ఓ వివాహం నిమిత్తం వచ్చింది. పెళ్లి అయిన తరువాత బయలుదేరిన ఆమె, పాపారావు పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో కలిశారు. అక్కడి నుంచి సారవకోట మండలం ధర్మలక్ష్మీపురం గ్రామ పరిధి నౌతల ఘాటీకి వెళ్లారు. తాను నీతో మీ ఇంటికి వచ్చేస్తానని పాపారావును పట్టుబట్టింది. అయితే ఇద్దరికీ వివాహమైందని, పిల్లలున్నారని, ఇది సరికాదని పాపారావు పేర్కొన్నప్పటికీ ఆమె నిరాకరించడంతో బలంగా తోసేశాడు. దీంతో ఆమె రాయిపై పడి తీవ్రంగా గాయపడింది. ఘటన మరింత జటిలమయ్యే అవకాశం ఉందని ఆందోళన చెందిన పాపారావు ఆమె తల, ముఖంపై రాయితో బలంగా కొట్టి చంపి బంగారు నగల కోసం దొంగలు చంపారనేలా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. ఇదిలా ఉండగా ఈనెల 24న ఊరు నుంచి బయలుదేరిన ఆరుద్ర కనిపించడం లేదని ఆమె సోదరుడు లోకేశ్వరరావు పాతపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తెంబూరు వరకు తాను దిగబెట్టానని, బయలుదేరిన ఆరుద్ర ఇంటికి చేరలేదని చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేశారు. అయితే నవతల ఘాటీలో మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో క్లూస్‌టీంతో పాటు డీఎస్పీ బాలచంద్రారెడ్డి, పాతపట్నం సీఐ నల్లి సాయి, ఎస్ఐ మహమ్మద్ యాశిన్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఇప్పటికే మిస్సింగ్ కేసు నమోదు కావడం, మృతదేహం ఆరుద్రదిగా నిర్ధారించుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నల్లి సాయి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్.ఎన్.పేట:మండలంలోని అలికాం-బత్తిలిరోడ్డుపై శ్యామలాపురం జంక్షన్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులకథనం మేరకు... కొత్తూరు వీఆర్వో రాము, వీఆర్ఏ అనిల్‌లు పేదల ఇళ్లస్థలాల పట్టాల పత్రాలను రిజిస్ట్రేషన్‌కు శ్రీకాకుళం నుంచి ద్విచక్ర వాహనంపై కొత్తూరు బయలుదేరారు. శ్యామ లాపురం సమీపంలో రోడ్డుకు అడ్డంగా పశువులు రావడంతో ద్విచ క్రవాహనం బోల్తాపడింది. దీంతో వారికి 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

మిర్చి లోడు లారీలో మంటలు

పలాసరూరల్:మిర్చి లోడుతో వెళుతున్న లారీ అగ్ని ప్రమాదానికి గురైంది. మంగళవారంగుంటూరు నుంచి పాట్నాకు మిరపలోడుతో వెళ్తున్న లారీ లక్ష్మీపురం టోల్‌గేటు వద్దకు వచ్చేసరికి లారీవీల్స్ సెంటర్ జాయింట్‌లో ఏర్పడిన సాంకేతిక లోపం వల్ల ఒక్కసారి మంటలు చెలరేగాయి. వెంటనే డ్రైవర్, క్లీనర్ అప్రమత్తమై వాహనాన్నినిలిపివేశారు. కాశీబుగ్గ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే లారీ వెనకభాగంలో రెండు టైర్లు కాలిపోయాయి.ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటిప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

పొందూరులో డెంగ్యూ కలకలం



లార్వాను గుర్తిస్తున్న వైద్య సిబ్బంది

పొందూరు: పొందూరులో డెంగ్యూ కలకలం నెలకొంది. ఇక్కడ పార్వతీనగర్ కాలనీలో జ్వరాలు స్థానికులతోపాటు పట్టణ వాసులను భయ పెడుతున్నాయి. ఒకే ఇంట్లో తీవ్రమైన జ్వరంతో ముగ్గురు శ్రీకాకుళంలోని రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి నిర్వహించిన ప్రాథమిక పరీక్షల్లో డెంగ్యూగా నిర్ధారణ కావడంతో తదుపరి పరీక్షలకోసం బాధితుల రక్తనమూనాలను ల్యాబ్‌కు వైద్యసిబ్బంది పంపించారు.మూడురోజులుగా కాలనీకి చెందిన సంజయ్, ప్రీతి, జ్ఞానేశ్వర్ తీవ్రమైన జ్వరం, ఒళ్లునొప్పులతో బాధపడుతున్నారు. ప్రాథమిక పరీక్షల్లో డెంగ్యూగా నిర్ధారణ కావడంతో తాడివలస పీహెచ్‌సీ వైద్యసిబ్బంది అప్రమ త్తమయ్యారు.కాలనీలో ఫాగింగ్‌స్ప్రే చేశారు. కాలనీలో లార్వాదోమల లార్వా గుర్తించి నాశనంచేశారు. ప్రస్తుతం కాలనీలో ఎవరికీ జ్వరాలు లేవని సిబ్బంది చెప్పారు.

మల్లన్న పాగాకు ప్రత్యేక పూజలు



మల్లన్నపాగాను ఊరేగిస్తున్న చేనేత కార్మికులు

పొందూరు: పొందూరులో చేనేత కార్మికులు నేసిన మల్లన్నపాగాకు మంగళవారం ప్రత్యేపూజలు నిర్వహించారు. దేవదాయశాఖ అధికారుల కోరిక మేరకు పొందూరులోని లావేటివీధికి చెందినచేనేతకార్మికుడు బనిశెట్టి ఆంజనే యులు మల్లన్నకు, భ్రమరాంభకు, శనగల బసవన్నకు, వినాయకుడికి, నందికి ప్రత్యేక వస్త్రాలు నేశారు. వీటిని శివరాత్రికి శ్రీశైలంలోనిఆలయం అధికారులకు అందజేస్తారు. పూజలు నిర్వహించిన మల్లన్నపాగాను పట్టణంలో ఊరేగించారు.

'ఉపాధి'లో అవకతవకలు జరిగితే చర్యలు: పీడీ

లావేరు: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బంది ఎటువంటి అవకతకలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు హెచ్చరించారు. మంగళవారం లావేరు మండల పరిషత్ కార్యా లయ ఆవరణలో 16వ విడత సామాజికతనిఖీ మండల ప్రజావేదిక సభ జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధిపనులకు సంబంధించి చేపట్టిన 1,356 పనులకు గాను రూ 18.83 కోట్లు ఉపాధి నిధులు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఈ పనులకు సామాజిక తనిఖీలు చేపట్టినట్లు తెలి పారు. ఎస్ఆర్‌పీ ఎం.గోవిందరావు మాట్లాడుతూ ఈ ఏడాది జనవరిలో చేపట్టిన 246 పనులకుగాను ఆడిట్ చేశామన్నారు. ఈనెల 12 నుంచి 26 వరకు తొమ్మిదిడీఆర్‌పీ బృందాలు మండలంలోని 33 పంచాయ తీల్లో సామాజిక తనిఖీచేపట్టయన్నారు. కొన్నిపంచాయతీల్లో అక్కడక్కడ మస్తర్లలో దిద్దుబాట్లు ఉన్నట్లుగుర్తించారని, కొలతల్లో కొద్దిపాటి తేడాలు ఉన్నట్లు సామాజిక తనిఖీల్లో వెల్లడయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితులు రొక్కం బాలకృష్ణ, ఎంపీడీవో గొర్లె భాస్కరరావు, డీవీవీ లవరాజు, నరసన్నపేట ఏపీడీ మురళీకృష్ణ, హెచ్‌ఆర్ మేనేజర్ శ్రావణ్, ఎస్ క్యూసీ సతీష్, ఏపీవో ఆర్ సత్యవతి, జేఈ లెలిన్‌బాబు పాల్గొన్నారు.

రేపటిలోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

ఆమదాలవలస:పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలని పెన్షనర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు సురవరపు శిమ్మినాయుడు, బొడ్డేపల్లి జనార్దనరావు ఒక ప్రకటనలో మంగళవారం కోరారు. సబ్ ట్రెజరీ కార్యా లయ పరిధిలోని 1130 మంది సర్వీసు, ఫ్యామిలీ పెన్షన ర్లకుగాను 969 మంది ఇప్పటివరకు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించారని, మిగిలిన 161 మంది పెన్షనర్లు వెంటనే లైఫ్‌సర్టిఫికెట్లు సమర్పించాలని కోరారు. గురువారంలోగా సబ్ ట్రెజరీ కార్యాలయంలో గాని, నెట్ సెంటర్‌ల్లోగాని లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలని సబ్ ట్రెజరీ అధికారి ఎస్.సువర్ణరాజు తెలియజేసినట్లు వారు పేర్కొన్నారు.

విశాఖ-బరంపురం పాసింజర్‌కు ఆమోదం

● పలాస 'మెమూ'ను పొడిగిస్తూ ఉత్తర్వులు
● హర్షం వ్యక్తం చేసిన ఎంపీ రామ్మోహన్‌నాయుడు

ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం:విశాఖ-బరంపురం రైలుకు ఆ శాఖ అధికారులు ఆమోదించారు. ఇప్పటివరకు విశాఖ-పలాస మధ్య నడుస్తున్న 'మెమూ' రైలును ఇచ్ఛాపురం మీదుగా ఒడిశాలోనిబరంపురం వరకు కొనసాగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీఅయ్యాయి. ఈ మేరకు శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా తూర్పుకోస్తా రైల్వే జీఎం మనోజ్‌శర్మ, ఖుర్దారోడ్ డీఆర్ఎం హెచ్ఎం బజ్వా, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. రైలు పొడిగింపుపై రైల్వే మంత్రి అశ్విన్ శ్రీవైష్ణవ్, వివిధ రైల్వే బోర్డు, డివిజన్ సమావేశాల్లో అధికారులను కలిసి వినతిపత్రాలు అందించినట్లు గుర్తుచేశారు. ప్రతిపాదనలకు ఆమోదం తెలపడంతో జిల్లాకు చెందిన ఉద్యోగులు, చిరువ్యాపారులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ఇందుకు సహకరించిన రైల్వే ఉన్నతాధికారులకు ఈ సందర్భంగా ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు.

●**ఇచ్ఛాపురం:** విశాఖ- పలాస ప్యాసింజర్‌ను మార్చి ఒకటో తేదీ నుంచి బరంపురం వరకు పొడిగించడంపై పలువురు హర్షం వ్యక్తంచేశారు.ఈ మేరకు రైల్వేజీఎం మనోజ్ శర్మ, పీసీఓఎం వైఎస్‌బాబు, సీపీటీఎం జీపీ మిశ్రాకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే జడ్‌ఆర్‌సీసీ సభ్యుడు కట్టా సూర్యప్రకాష్,జడ్‌పీ చైర్‌పర్సన్ పిరియా విజయతో పాటు పట్టణ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్ మంజీర్ జిలానీ సమూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మంజీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్: రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ మంజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ రక్షిత నీటిపథకం నిర్వహణ, జలజీవన్ మిషన్లపై కలెక్టర్ తన కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జలజీవన్ పనులపై అడిగితెలుసుకన్నారు. జిల్లాలో తాగునీటి సమస్య ఉన్న కొండప్రాంతాల్లో గ్రావిటేషన్‌ద్వారా సమస్య లేకుండా నీరందిస్తున్నట్లు తెలిపారు. లే అవుట్లు, ఇళ్ల కనెక్షన్లపై అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ డిపార్టుమెంట్‌తో సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రసాదరావు,ఈఈ జాన్,ఆషాలత, డిప్యూటీసీఈఓ వెంకటరామన్ పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బంది సమ్మె నోటీసు

అరసవల్లి: ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వర్తిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర సిబ్బంది తమ డిమాండ్ల సాధన కోసం ఉన్నతాధికారులకు సోమవారం సమ్మె నోటీసులిచ్చారు. జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా రిజర్వేషన్ పద్ధతిలో ఉద్యోగాల్లో చేరిన తమకు తగిన స్థాయిలో వేతనాలు ఇవ్వకుండాఅన్యాయం చేస్తున్నారని జిల్లా జేఏసీ చైర్మన్ వైవీ రమణ తెలిపారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్నా కనీసస్థాయిలో కూడా స్పందన లేదని వాపోయారు.చివరకు సమ్మె ఒక్కటే పరిష్కారమని తెలిపారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్, డ్వామా పీడీ, జిల్లాలోని అన్ని మండలాల అభివృద్ధి అధికారులకు సమ్మె నోటీసులిచ్చాని, వారంరోజుల్లోగా తమ సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్ప వేరే మార్గం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో రత్నాకర్, బీవీ రమణమూర్తి, వెంకటరమణ, అరుణ, సుబ్రహ్మణ్యం, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆరుతడి పంటలపై దృష్టి సారించండి: ఏడీ



మాట్లాడుతున్న ఏడీ లక్ష్మణరావు

బూర్జ: ఆరుతడి పంటలపై రైతులు దృష్టిసారించాలని భూగర్భ జలశాఖ ఏడీ డి.లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం కురుం పేటలో కాశీసాగరం ఆయకట్టు రైతులకు ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగునీరు వ్యవసాయ పరివర్తన పథకంలో భాగంగా యూత్ క్లబ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పంట నీరు ప్రణాళికపై శిక్షణ నిర్వహించారు. ఈ సం దర్భంగా మాట్లాడుతూ తక్కువ నీటితో పండించిన పంటలను వేసుకుని రైతులు ఉత్పత్తి, ఉత్పాదకతను మెరుగుపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ జియాలజిస్ట్ రమా శ్రీదేవి, ఏపీడీ లక్ష్మణరావు, సర్పంచ్ కొరికాన వెంకట శివసాయి, సీతారామరాజు, మాజీ సర్పంచ్ కొరికాన వెంకటరావు, రైతులు కత్తిర నరసింగరావు, విక్రమ్, వాసు, అశోక్‌కుమార్, యూత్ క్లబ్ ప్రతినిధులు కె.లక్ష్మణరావు, ఉమామహేశ్వరరావు, శ్రీరామ్ పాల్గొన్నారు.

హాస్యాస్పద నిర్ణయాలు తగదు

● శాశ్వతమైన చర్యలు లేకుండా సంకీర్తనలేంటి
● టీటీడీ నిర్ణయాలపై స్వామి శ్రీనివాసానంద ఆగ్రహం



మాట్లాడుతున్న స్వామి శ్రీనివాసానంద

పొందూరు:తిరుమల వెళ్లే నడకదారిలో పులులు, ఎలుగుబంట్లు వంటి క్రూరమృగాలు దాడిచేయకుండా శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలసిన టీటీడీ అధికారులు నడకదారిలో సంకీర్తనలని ప్రకటించడంపై ఆంధ్రప్రదేశ్ సాధుపరిషత్ అధ్యక్షుడు, ఆనందాశ్రమ పీఠాధిపతి స్వామి శ్రీనివాసానంద ఆగ్రహంవ్యక్తం చేశారు. హాస్యాస్పదమైన నిర్ణయాలు తీసుకోవడం తగదు హితవుపలికారు. మంగళవారం గారపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్రూరమృగాలు దాడి చేయకుండా రక్షణ కవచం ఏర్పాటుచేయాలని భక్తులు కోరుతుంటే టీటీడీ మాత్రం హాస్యాస్పదమైన నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. గతంలో క్రూరమృగాలను ఎదుర్కోవడానికి భక్తులకు కర్రలు ఇచ్చిన టీటీడీ ఇప్పుడు సంకీర్తనలతో జంతువులను రాకుండా చేస్తామని హాస్యాస్పద నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. టీటీడీ నిర్ణయాలు జంతువులు దాడిచేసేలాచేసి ఆ దోషాలను వేంకటేశ్వరస్వామికి ఆపాదించాలని చూస్తోందని భక్తులకు అనుమానాలు వస్తున్నాయన్నారు. ప్రమాదాలు జరిగిన తరువాత టీటీడీ నిర్వహించిన నాలుగు సమావేశాల్లో శాశ్వతమైన చర్యలు తీసుకోవడంపై మాట్లాడకపోవడం దారుణమన్నారు. భక్తులకు నాణ్యమైన భోజనం అందించలేకపోతున్న ప్రస్తుత టీటీడీబోర్డు వారికి అనుకూలమైన స్వామీజీలను పిలుపించుకుని నిర్ణయాలు స్వాగతిస్తు న్నట్లుగా ప్రకటించడం స్వామీజీలను అవమానించడం, వారిని బలిపశువులను చేయడమేనని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం, ప్రస్తుత టీటీడీ నిర్ణయాలు స్వామివారి భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.

ఓటు విలువపై ప్రచారం చేయాలి



పొందూరు: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పొందూరు:పజాస్వామ్యంలో ఓటు విలువను ప్రజలకు విద్యార్థులే ప్రచారం చేసి అవగాహన కల్పించాలని పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవాసు దేవరావు చెప్పారు. పొందూరులో మంగళవారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో కళాశాలలో ఓటర్ల చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఫ్యాకల్టీ రవి, యువజనసంఘం ప్రతినిదులు రామారావు, కోటి ఎన్‌వైకే వలంటీర్లు హరిచందన, అనూష పాల్గొన్నారు.

● **ఆమదాలవలస:** మునిసిపాలిటీని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం, అరుణోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓటు హక్కుపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పలువురు వక్తలుఓటు ద్వారా మంచి నాయకులను ఎన్నుకునే విధంగా ప్రతిఒక్కరూ కూడా అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ఎస్ఎన్ స్వామి, వైస్ ప్రిన్సిపాల్ ఉషాపద్మిని,గంటా బోర్ను, జి.అరుణ్‌కుమార్, నెహ్రూ యువ కేంద్రం వలంటీర్ కె.అప్పలరాజు, గౌతమ్, పవన్ పాల్గొన్నారు.

'మేనిఫెస్టోలో జర్నలిస్టుల సంక్షేమాన్ని చేర్చాలి'

శ్రీకాకుళం అర్బన్ : రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోల్లో జర్నలిస్టులసంక్షేమాన్నిచేర్చాలని చిన్న,మధ్యతరహా వార్తాపత్రికల సంఘం (స్మామ్నా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు నల్లి ధర్మారావు, సీహెచ్ రమణా రెడ్డి ఒకప్రకటనలో డిమాండ్‌చేశారు. అక్రిడిటేషన్ నిబంధనలు సడలించాలని, హెల్త్ కార్డుల పథకం అమలుచేయాలని కోరారు. ప్రమాద బీమా, సంక్షేమనిధి, ఉత్తమ జర్నలిస్టుల అవార్డులు పునరుద్ధరణకు మేనిఫెస్టోలో హామీ ఇవ్వాలని కోరారు. ఇళ్లస్థలాల జీవోసవరించి సీనియారిటీ ప్రాతిపదికన నామమాత్రపు ధరకు మంజూరుచేయాలని కోరారు.ప్రొఫెషనల్ కమిటీల పునరుద్ధరణకు నిధులు కేటాయించి ప్రెస్‌అకాడమీని పనిచేయించాలని సూచించారు. వెటరన్ జర్నలిస్టులకు పింఛన్లు ఇవ్వాలనికోరారు.

'నాడు-నేడు' పనులు వేగవంతం చేయండి

ఇచ్ఛాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని ఏపీఈడబ్ల్యూఐడీ చైర్మన్ యనమల నాగార్జున యాదవ్ అధికారులకు సూచించారు. మంగళవారం ఇచ్ఛాపురంలోని జీహెచ్ఎస్ పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్లక్ష్యం వహించకుండా పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జేఈ ఎ.సునీల్‌కుమార్, సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య, ఎంపీపీ బోర పుష్ప పాల్గొన్నారు.

రత్తకన్నలో 'ప్రజాపోరు-2'

ఇచ్ఛాపురం: మునిసిపాలిటీలోని రత్తకన్న 18 వార్డులో బీజేపీ ప్రజాపోరు-2 కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.ఈసందర్భంగా బీజేపీనియోజకవర్గ కన్వీనర్ బుద్దాల నిర్మలారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదలకుఅందిస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగంచేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు సత్యం, రామ్మూర్తి, భాస్కరరావు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న అశోక్

సోంపేట:మండలంలోని శాసనాంలో ఎంపీల్యాడ్స్ రూ.ఐదులక్షలతో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే బెందాళం అశోక్ మంగళవారం శంకుస్థాపనచేశారు. కార్యక్రమంలో సూరాడ చంద్రమోహన్, హరికృష్ణ పాల్గొన్నారు.

ఆదిత్యుని హుండీల లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి హుండీలను మంగళవారం ఆలయఅనివెట్టి మండపంలో లెక్కించారు.ఈ మేరకు ఆదిత్యుని ఆలయంలో 23రోజులకు రూ.59,10,775 ఆదాయం లభించింది. ఇందులో నోట్ల రూపంలో రూ.57,61,049లు, చిల్లర రూపంలో రూ.1,49,726, బంగారం రూ.31 గ్రా ములు, వెండి 600 గ్రాములు, తొమ్మిది యూఎస్ డాలర్లు, నేపాల్ కరెన్సీ 25 రూపాయలు, సౌదీ అరేబియా 10 రియాల్స్,ఒమన్- 100 బైసా, యూఏఈ- 140 దిర్హామ్స్ వచ్చాయి. కార్యక్రమంలో దేవదాయశాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్,ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈవో డీఎల్‌వీ రమేష్‌బాబు, అనువంశిక ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు, దేవదాయ శాఖ సీనియర్ అసిస్టెంట్ జీవీబీఎస్ రవికుమార్, పాలకమండలి సభ్యుడు జలగడుగుల శ్రీనివాస్, అర్చకులుపాల్గొన్నారు. అలాగే సూర్యనారాయణ స్వామివారిని సౌత్‌జోన్ అడిషనల్ సెంట్రల్ పీఎఫ్ కమిషనర్ వైశాలి దాయల్ దర్శించుకున్నారు. ●**గార:** శ్రీకూర్మనాథుని ఆలయహుండీలను బుధవారం తెరచి లెక్కించు నున్నటు ఈవో జి.గురునాథరావు తెలిపారు.

జనసేన కార్యకర్తకు ఆర్థికసాయం

బూర్జ:తోటవాడకు చెందిన జనసేన కార్యకర్త కర్నేన రాజశేఖర్ కుటుంబానికి ఆ పార్టీ నాయకుడు కొత్తకోట నాగేంద్ర ఆధ్వర్యంలోరూ.15 వేలు మంగళవారం అందజేశారు. రాజశేఖర్ రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో ఆర్థికసాయం చేసినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. కార్య క్రమంలో జనసేన నాయకులు కొల్ల జయరాం, కోరుకొండ మల్లేశ్వరరావు, సిక్కోలు విక్రమ్, రమేష్, కొత్తకోట శ్రీను, గేదెల వాసు, మామిడి సత్యనారాయణ, దిలీప్, మోహన్, కిరణ్ పాల్గొన్నారు.

పోలియోరహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

అరసవల్లి:పోలియోరహిత జిల్లాగా తీర్చిదిద్దాలని, అందుకు ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని డీఎంహెచ్‌వో బి.మీనాక్షి కోరారు. మంగళవారం శ్రీకాకుళంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కా ర్యాలయంలో పోస్టర్లు, బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో మార్చి మూడో తేదీన నిర్వహిస్తున్న పల్స్‌పోలియో కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఐవో ఈశ్వరి, మాస్ మీడియా అధికారి పైడి.వెంకటరమణ, వేంకటేశ్వర్లు, సూర్యకళ, మోహిని పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు.. వర్షాలు లేక

● ఎండుతున్న మొక్కజొన్న పంట
● ఆందోళన చెందుతున్న సరుబుజ్జిలి మండల రైతులు

సరుబుజ్జిలి

మండలంలోని మొక్కజొన్న రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది అక్టోబరు, నవంబరులో ఆశించిన వర్షాలు లేకపోవడంతో జలాశయాల్లో నీరు చేరలేదు. దీంతో రబీలో వేసిన మొక్కజొన్నపంట ఎండి పోతోంది. దీనికితోడు అనధికారికంగా విద్యుత్‌కోత విధిస్తుండడంతో మోటార్లతో తడులు పెట్టడానికి అవకాశం లేకుండాపోతోందని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది వేసవి పంటగా రైతులు మొక్కజొన్న సాగుచేస్తున్నారు. మోటార్లు ద్వారా జలాశయాల్లో నీటిని తోడి మొక్కజొన్న పంట పండంచాలనుకొనే రైతులకు విద్యుత్‌శాఖ నిర్వాకం శాపంగా మారిందని పెద్ద సవలాపురం సర్పంచ్ పల్లి సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు.



పెద్ద సవలాపురంలో సాగునీరు అందక నెర్రలిస్తున్న పంటపొలం

ఇదీ పరిస్థితి..

మండలంలోని సింధువాడ, వీరమల్లిపేట, పెద్ద సవలాపురం, మూలపేట, యారగాం, ఇసుకలపాలెం గ్రామాలకు చెందిన సుమారు 400 ఎకరాల్లో ఈ ఏడాది అధిక పెట్టు బడులు పెట్టి మొక్కజొన్న పంట రైతులు వేశారు. వంశధార నది పరివాహక ప్రాంతంలో ఉన్న ఈ గ్రామాల్లో పంట పొలాలు సాగునీరందించడానికి రైతులు పంపుసెట్లు, విద్యుత్ శాఖ నిబంధనలు మేరకు ట్రాన్స్‌ఫార్మర్లు కూడాఏర్పాటు చేసుకు న్నారు. అయితే సరుబుజ్జిలి సబ్‌స్టేషన్ నుంచి సాగునీటి పం పుసెట్లకు అందించే విద్యుత్ సరఫ రా గతంలో ఉదయం నాలుగు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరా జరిగేదని రైతులకు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం దానిని ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ఉదయం ఆరు గంటల నుంచి నాలుగు గంటల వరకు సరఫరా చేయడం వల్ల మూడు గంటల సమయం కుదించడంతో నీటి కష్టాలు తప్పడంలేదని రైతులు వాపోతున్నారు.



పంటపొలాల్లో రైతులు సొంతంగా ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్లు

దెబ్బతింటున్న మోటార్లు..

మండలంలోని పలుగ్రామాల్లో లోవోల్టేజీ వల్ల మోటార్లు కూడా దెబ్బతింటున్నాయని, దీంతో తమపై మరింత ఆర్థికభారం పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మొక్కజొన్న పంటతో ఇప్పటికే అధిక పెట్టుబడులు పెట్టి ఆర్థిక ఇబ్బందులతో రైతులు సతమతమవుతున్నారు. ఈ తరుణంలో విద్యుత్ కోతల వల్ల చివరి దశలో ఉన్న మొక్కజొన్న పంటకు నీరందక భూమి బీటలు వారుతోందని రైతులు వాపోతున్నారు. దీంతో చేతికొచ్చే మొక్క జొన్న పంట ఎండిపోయే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ సరఫరాల లోపాలను పరిష్కరించి 400 ఎకరాల మొక్కజొన్న పంట ను తక్షణమే కాపాడాలనేఇ ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. కాగా లోవోల్టేజీ నేపథ్యంలో రైతులు సొంతంగా ట్రాన్స్‌పార్మర్లు ఏర్పాట్లుచేసుకుంటున్నారు.

నిబంధనల మేరకు సరఫరా

పెద్దసవలాపురం, వీరమల్లిపేట, ఎరగాం తదితర గ్రామాల్లో వ్యవసాయ పంపుసెట్లకు ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యుత్ సరఫరాకు చర్యలు చేపడుతున్నామని సరుబుజ్జిలి మండల విద్యుత్‌శాఖ ఏఈ పి.అప్పల నాయుడు తెలిపారు. కొంతమంది రైతులు విద్యుత్ శాఖ ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్లర్ల కెపాసిటికి మంచి అధిక విద్యుత్ వాడకం వల్లే నాణ్యతలోపిస్తుందని చెప్పారు.